క్లుప్తంగా

బీజేపీ కందుకూరు మండల కమిటీ ఎన్నిక


అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు

కందుకూరు: బీజేపీ కందుకూరు మండల పూర్తి కమిటీని జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీని అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి శనివారం ప్రకటించారు. మండల పార్టీ ఉపాధ్యక్షులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, అచ్చన సురేష్, క్లాం సుధాకర్‌రెడ్డి, గౌర పర్వతాలు, ప్రధాన కార్యదర్శులుగా చిలుకల రఘునందన్, గౌర ప్రభాకర్, కార్యదర్శులుగా కుమ్మరి నర్సింహ, తాళ్ల బాలేష్, మాదారం కృష్ణగౌడ్, అచ్చన పద్మపాండు, కోశాధికారిగా సరోజనాయక్‌తో పాటు మరో 30 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

లడ్డూ @ రూ. 77,777

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మారుతీనగర్ ఫేజ్–2లో మహావీర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి చేతిలోని లడ్డూ బొల్లం మల్లేష్ యాదవ్‌ను వరించింది. వేలంలో ఆయన రూ.77,777లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చాట్ల నాగభూషణం, మారుతీనగర్‌కాలనీ అధ్యక్షుడు మొగిలి తిరుపతయ్య, మాజీ అధ్యక్షుడు కర్ణకోట నరేశ్, కాలనీ కమిటీ సభ్యులు నరేష్, రవి, సాయిరెడ్డి, సత్యప్రవీణ్ సహా మహావీర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు.

అక్కెర యాదయ్య మరణం తీరనిలోటు

బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: తుమ్మలూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అక్కెర యాదయ్య ముదిరాజ్ అకాల మరణం పార్టీకి తీరని లోటని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని తుమ్మలూరులో గుండెపోటుతో మరణించిన అక్కెర యాదయ్య భౌతికాయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పార్టీ యాదయ్య కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, సీనియర్ నాయకులు బస్వ పాపయ్యగౌడ్, కొప్పు భాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, మండల అధ్యక్షుడు యాదిశ్, మాజీ మండల అధ్యక్షుడు మాధవాచారి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మద్ది రామిరెడ్డి, మదన్‌మోహన్‌గుప్తా, పలువురు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్

కందుకూరు: రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటు మోదీ ప్రభుత్వం, ఇటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎంత మేర ఎరువులు అవసరమో అంచనా వేయలేకపోవడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం వ్యవసాయ అధికారులు, సొసైటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తలెత్తిందన్నారు. ఇదంతా ప్రభుత్వాల అసమర్థతతో నేనని విమర్శించారు. టోకెన్లు ఇచ్చి రోజులు గడుస్తున్నా యూరియా సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే యూరియాను అవసరం మేరకు సరఫరా చేయకపోతే జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

సన్మానం

షాద్‌నగర్‌రూరల్: ఉద్యమకారుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో వెంకట్‌రాంరెడ్డి నియోజకవర్గంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన పోరాటాన్ని గుర్తించి ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని పదవులను చేపట్టాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు: బ్యాంక్ కాలనీలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న కాలనీవాసులు


కందుకూరు: కొత్తూర్‌లో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న భీమ్‌సేన యూత్ సభ్యులు

వైభవోపేతం.. నిమజ్జనోత్సవం

నియోజకవర్గంలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న బొజ్జ గణపయ్యలను భక్తులు డప్పువాయిద్యాలు, కోలాటాలు, నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలించి వీడ్కోలు పలికారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. కాగా ఆయా మండపాల వద్ద లడ్డూలను లాటరీ, వేలం ద్వారా భక్తులు దక్కించుకున్నారు.

– మహేశ్వరం


మహేశ్వరం: రావిర్యాలలో రూ.1.61 లక్షలకు లడ్డూ దక్కించుకున్న కిన్నెర భాస్కర్


కందుకూరు: లాటరీ ద్వారా లడ్డూ దక్కించుకున్న ముస్లిం సోదరుడు ఆసిఫ్‌జానీ


బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో రూ. 7.10 లక్షలకు గణనాథుడి లడ్డూ దక్కించుకున్న గౌర సత్తయ్య


బడంగ్‌పేట్: వినాయకుడి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు


కందుకూరు: తిమ్మాపూర్‌లో రూ.1.15 లక్షలకు లడ్డూ దక్కించుకున్న సరికొండ వెంకటేశ్‌గౌడ్


హుడాకాంప్లెక్స్: కొత్తపేటలో స్వాగత వేదికలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

కొందుర్గు: పార్టీలకతీతంగా రైతులందరూ ఏకమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ముట్పూర్ రైతువేదిక వద్ద బలరామ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, ప్రభుత్వం పంటలకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కరెంటు సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయన్నారు. రైతులందరూ ఏకమై సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీకేఎస్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి రామస్వామి, రైతులు మల్లేశ్, పెంటయ్య, రమేశ్, సందీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, ద్విజేందర్, యాదయ్య, కాంతంరెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగోలు: వికలాంగుల పింఛన్ రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అన్ని రకాల చేయూత పింఛన్ రూ. 4 వేలు పెంచాలని ఈ నెల 8 న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కొత్తపేట డివిజన్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్ము రాజశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం కొత్తపేట డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 8 రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరుశురాములు, ధర్మారపు అశోక్, ఇరుగు నాగరాజ్, ఇరుగు చంటి రవి, విహెచ్‌పీఎస్ నాయకులు చిత్తలూరి వేణుగౌడ్, బర్పటి ఎల్లన్న పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో సీపీఎం పాత్ర కీలకం

హస్తినాపురం: భూమి, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో హస్తినాపురంలోని నందనవనం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సర్కిల్ కమిటీ సమావేశంలో ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుల వారసత్వాన్ని పుచ్చుకుని ప్రజా ఉద్యమాల్లో సీపీఎం పార్టీ ముందుకు సాగుతుందన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది అమరులై పదిలక్షల ఎకరాల భూమిని పేదప్రజలకు పంచిన ఘనత ఎర్రజెండా పార్టీదే అని గుర్తు చేసారు. చరిత్రను వక్రీకరిస్తూ బీజేపీ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో రామస్వామి, దండు రాధ, పురుషోత్తంచారి, బి.దుర్గారావు, భూషరాజు, కాశయ్య పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ముందస్తు అరెస్టులు సరికాదు


పోలీసుల అదుపులో రాంబల్‌నాయక్

కేశంపేట: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా శనివారం పోలీసులు లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్‌ను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరుడైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టులో కేసు వేశారన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్ర మంత్రికి వినతిపత్రం అందించే అవకాశం లేకుండా.. అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భక్తుల సౌకర్యార్థం చలివేంద్రాలు


చలివేంద్రం ఏర్పాటులో డీజీఎం హష్మత్‌అలీ

చాదర్‌ఘాట్: గణేష్ నిమజ్జనం సందర్భంగా నగర జలమండలి సీఎండీ ఆదేశాల మేరకు శనివారం మలక్‌పేటలో భక్తుల సౌకర్యార్థం డీజీఎం హష్మత్ అలీ నీళ్ల ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 20 వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశామని అదే విధంగా భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచామన్నారు. జలమండలి తరఫున 20 మంది సిబ్బందిని కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు


వేడుకల్లో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, విజయ్‌కుమార్ తదితరులు

నాగోలు: కులమతాలకతీతంగా ఓనం పండుగను కేరళ ప్రజలు జరుపుకుంటరని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు సుప్రజా హాస్పిటల్ ఎండీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఓనం వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఏపూరి సోమన్న, బీసీబాలలక్ష్మీ, కేరళ సిస్టర్స్ పాల్గొన్నారు.

ముంత ఆంజనేయులు సేవలు మరువలేనివి


ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ముంత ఆంజనేయులు చేసిన సేవలు మరువలేనివని ఆ సంఘం జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ ఆవరణలో శనివారం ముంత ఆంజేయులు 6వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలయ్య, సత్యం, లక్ష్మీదేవమ్మ, అరుణ, జ్యోతిర్మయి, శివరాములు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కందుకూరు: కందుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో శనివారం ఎంపీటీసీ స్థానాల ముసాయిదా ఓటరు లిస్టుతో పాటు పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 8వ తేదీవరకు తెలియపర్చాలని ఆమె తెలిపారు. మొత్తం 35 గ్రామ పంచాయతీలకుగాను 16 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, మొత్తం 51,706 ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 21,865, స్త్రీలు 25,841 ఉన్నారన్నారు. 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కాగా సోమవారం ఓటర్ల లిస్టుపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఉదయం 11.30 గంటల వరకు హాజరుకావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సులోచన, సీనియర్ అసిస్టెంట్ పద్మ, కంప్యూటర్ ఆపరేటర్ రాకేశ్ పాల్గొన్నారు.


కందుకూరులో ఓటర్ల ముసాయిదాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సరిత, సిబ్బంది

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయండి

కందుకూరు: పింఛన్ల పెంపు కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తన పర్యటనలో భాగంగా ఈ నెల 8వ తేదీన కందుకూరుకు రానున్నారని, ఆ రోజు నిర్వహించనున్న సభను విజయవంతం చేసేలా లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, మాజీ సర్పంచ్‌లు మంద సాయిలు, మస్కు బాబు కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మగళ్ల జంగయ్యమాదిగ, గానుగపేట జంగయ్య, యాచారం పాండు, జంగయ్య, కృష్ణమాదిగ, అందుగుల కృష్ణమాదిగ, గుండ్రపల్లి కృష్ణమాదిగ, కొమ్మగళ్ల నరసింహా, మస్కు సత్తయ్య పాల్గొన్నారు.


కందుకూరులో సమావేశమైన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

అంగన్‌వాడీ యూనియన్ కమిటీ ఎన్నిక

చేవెళ్ల: అంగన్‌వాడీ యూనియన్ చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు తెలిపారు. చేవెళ్లలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలపై సీఐటీయూ పోరాడుతోందని.. కార్మికులకు అండగా నిలబడుతుందన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలోని నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలిగా టి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పి.స్వప్న, కోశాధికారిగా ఎం.ఉమారాణి, ఉపాధ్యాక్షులుగా రాధ, ప్రవీణ, పద్మారాణి, ప్రేమలత, సహాయ కార్యదర్శులుగా కవిత, సరస్వతి, భూదేవి, 20 మందిని ప్రాజెక్టు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


ఎన్నికైన సభ్యులతో సీఐటీయూ నాయకులు

అంజయ్య అవినీతిని నిరూపిస్తే..

వైఎస్సార్ విగ్రహం సాక్షిగా ముక్కు నేలకు రాస్తాం

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్

షాద్‌నగర్‌రూరల్: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే పట్టణ ముఖ్య కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాస్తామని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ సమావేశమైనా, ఏ వేదిక అయినా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంజయ్యయాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని మాట్లాడటం సరికాదన్నారు. వ్యక్తిగత ఆరోపణలను మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ప్రెస్‌మీట్‌లో అంజయ్యయాదవ్ చేసిన అంశాలను ప్రస్తావించకుండా కాంగ్రెస్ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మంజూరు చేసిన పనులకే కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు ఆదర్శంగా పరిపాలన చేసిన అంజయ్యయాదవ్ అవినీతికి పాల్పడ్డారనే తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ భూమిని అక్రమంగా తీసుకున్నారనే ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎంఎస్.నటరాజ్, లక్ష్మణ్‌నాయక్, బచ్చలి నర్సింహ, రవియాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ముసీలయ్య సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: నర్సప్పగూడ మాజీ సర్పంచ్ గోవిందు ముసీలయ్య గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో శనివారం గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ముసీలయ్య 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ సర్పంచ్‌లు ఎమ్మె సత్యనారాయణ, కడేంపల్లి శ్రీనివాస్‌గౌడ్, జెట్ట కుమార్, వెంకట్‌రెడ్డి, యాదమ్మ, గోవిందు, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీభూపాల్, నాయకులు గోవిందు యాదయ్య, గోవిందు గోపాల్, గోవిందు శేఖర్, లక్ష్మణ్‌గౌడ్, బంటారం కృష్ణగౌడ్, సుదర్శన్‌గౌడ్, కొండన్నగూడ సత్యం, కాట్న శ్రీశైలం, జంగిలి కుమార్, సీరటి సురేందర్, గోవిందు శ్రావణ్‌కుమార్, జంగిలి మల్లయ్య, శంకరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, నాయకులు

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

షాబాద్: కేంద్ర ప్రభుత్వం పలు నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పేదలకు మేలు చేసేలా జీఎస్టీ పన్నుల భారాన్ని తగ్గించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంతగా అనేక నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 5 శాతం తగ్గించారని, కొన్నింటికి పూర్తిగా మినహాయించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాదె హరీశ్, నాయకులు తదితరులు ఉన్నారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు